కథానిక - డి. కామేశ్వరి

# అందిన ద్రాక్ష

**పెళ్ళి అంటే దంపతులు నీతినియమాలకు కట్టుబడి ఉండడం. భర్త నీతి తప్పినప్పుడు నిలదీసే సత్తా భార్యకు ఉండాలంటే, ఆమె ఆర్థికంగా స్వతంత్రురాలై ఉండాలి.**

"సినిమా ఎలా ఉంది?" సాయంత్రం ఆరున్నరకి హుషారుగా ఈల వేసుకుంటూ ఇల్లు చేరిన మొగుణ్ణి ఉక్రోషంగా అడిగింది ప్రభావతి. గతుక్కుమన్నాడు భాస్కర్. నిమిషంలో మొహంలో భావం మార్చేసి 'సినిమా, ఏ సినిమా' అంటూ అమాయకం నటించాడు. 'చాలించండి నటన.' ప్రభావతి తీక్ష్ణంగా ఏదో అనేలోగా రాహుల్ పరిగెత్తుకొచ్చాడు. 'డాడీ, డాడీ! మమ్మీ, నేను నిన్నే పెళ్ళాడుతా సినిమాకెళ్ళాం. మరేం నాగార్జున పండు, పండు అంటూ ఆంటీని బలే ఏడ్పించాడు.' సినిమాని ఏకరవు పెడ్తున్నాడు సంబరంగా రాహుల్. ప్రభావతి తమని చూసిందన్నది అర్థమై కలవరపడ్డాడు. 'నన్ను తీసికెళ్ళకుండా మీరిద్దరూ వెళ్ళిపోయారా?' బుంగమూతి పెట్టాడు వాతావరణాన్ని తేలికపరచడానికి.

"పాపం మీకెక్కడ తీరికలెండి మాతో రావడానికి. తీరికున్నా కోరికుండద్దూ. ఆఫీస్‌లో ఓవర్‌టైం చేసి అల్సిపోతున్నారు." కొడుకు ముందు ఇంకేం అనకుండా తీక్ష్ణంగా ఓ చూపు విసిరి, వంటింట్లోకి వెళ్ళిపోయింది ప్రభావతి. కాస్త ఊపిరి పీల్చుకుని ఏం చెప్పాలో ఆలోచించసాగాడు భాస్కర్.

రాహుల్ పడుకున్నాక ఆపేసిన సంభాషణ మళ్ళీ మొదలెట్టింది. "మీపక్కన కూచున్న అమ్మాయెవరు?" భాస్కర్ నిర్లక్ష్యంగా, పుస్తకంలోంచి తలెత్తకుండానే "సినిమా హాల్లో ఎవరో లక్షమంది కూర్చుంటారు. అందర్నీ పేర్లడిగితే తంతారు." చాలా విట్టీగా మాట్లాడాననుకున్నాడు.

"ఆహా అలాగా, సినిమా హాల్లో పక్కనున్న మగాడి బుజాల మీద తలవాల్చి, మగాడు బుజాల చుట్టూ చేతులు వేస్తున్నా ఊరుకుందంటే బజారు సరకు అయి ఉండాలి. కాలక్షేపానికి ఎవరినన్నా తీసికెళ్ళారా." వ్యంగ్యంగా అంది. భాస్కర్ మొహం ఎర్రబడింది. "ఎవరో ఫ్రెండు బాగుందంటే, వర్క్ తొందరగా అయిపోయిందని మ్యాట్నీకి వెళ్ళాం. పక్కన ఏ ఆడదో వచ్చి కూచుంటే నా తప్పా?" తెచ్చిపెట్టుకున్న కోపంతో దబాయించాడు.

"ఆఁహాఁ, అలాగా, ఆ ఫ్రెండ్ ఎవరో! రంజనా?" ఎగతాళిగా ఎత్తిపొడిచింది. ప్రభావతి తామిద్దర్నీ చూసిందన్నది భాస్కర్‌కి అర్థమైంది.

"నేనేం కల్సివెళ్ళలేదు. ఆవిడ సినిమాకి వచ్చింది. మాకు టిక్కెట్లు దొరక్కపోతే ఆవిడచేత కొనిపించాం. సీట్లు పక్కపక్కన వచ్చాయి." తెలివైన సంజాయిషీ ఇచ్చానని గర్వంగా ఇప్పుడేమంటావు అన్నట్టు చూశాడు.

"టికెట్లు పక్కపక్కన వచ్చిన ఆడవాళ్ళంతా పక్కనున్న మగాడి బుజాలమీదకి ఒరిగిపోతారు కాబోలు."

"ఇదిగో, అనవసరంగా లేనిపోనివి ఊహించి మాటలనకు. చీకట్లో పెద్ద చూసినట్టు పోజులు మాను. ఒక ఆఫీసులో పని చేస్తున్నవాళ్ళం. సీటు నంబర్లు పక్కన వస్తే మాట్లాడుకోమా. నీవు మీ ఆఫీసులో మగాళ్ళతో మాట్లాడవా. పెద్ద పతివ్రతలా పోజులు పెట్టకు."

"మగాళ్ళతో మాట్లాడతాను. కానీ, బుజాల మీద చేతులు వేయించుకోను. వాళ్ళ బుజంమీద తల పెట్టను. ఇంతకీ నాదంతా అనుమానం, అపోహ అంటారు."

"అక్షరాలా." కోపంగా అన్నాడు. "ఆఁహాఁ, అలాగా. అయితే, ఉండండి" అంటూ ప్రభావతి లేచి బీరువాలోంచి ఓ ఉత్తరం పట్టుకొచ్చి 'ఇది చదివి చెప్పండి మీ జవాబు!' అంది సూటిగా నిలేస్తూ. అదే ఆకాశరామన్న ఉత్తరం.

"మీ భర్త తనాఫీసులో పనిచేసే అమ్మాయి రంజనతో సినిమాలు, షికార్లు, హోటళ్ళు తిరుగుతున్నారు గత రెండు మూడు నెలలుగా. కళ్ళు తెరవండి, మీ సంసారం కాపాడుకోండి. మీ ఆయన చేసే ఓవర్ టైమ్ ఆఫీసులో కాదు, రంజన ఇంట్లో.

-శ్రేయోభిలాషి."

ఎవరీ ఆకాశరామన్న. నెల రోజులక్రితం రాసిన ఉత్తరం అది. భాస్కర్ మొహం నల్లబడింది. ఎవరు రాశారు? తన ఆఫీసులోవాళ్ళే ఎవరో అయి ఉంటారు. మరి ఉత్తరం నెల రోజులక్రితం వచ్చినా ప్రభావతి అడగలేదే!

"ఇంతేకాదు, పదిరోజులక్రితం ఓ ఫోను వచ్చింది నా బ్యాంకుకి- 'మీవారు, ఆ రంజన ఫలానా హోటల్లో, ఫలానా రూములో ఉన్నారు. మీకనుమానం అయితే స్వయంగా వచ్చి చూసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోండి' అని ఎవరో మగవాళ్ళు ఫోన్ చేశారు. ఏదో ఆకాశరామన్న ఉత్తరం ఎవరో అసూయతో రాసి ఉంటారు. నిజానిజాలు తెలుసుకోకుండా మిమ్మల్ని అడగడం ఎందుకు అని కొన్నాళ్ళుగా మిమ్మల్ని కనిపెడ్తున్నాను. ఆ రోజు ఫోను వచ్చాక నేను బయలుదేరి వెళ్ళేసరికి మీ ఇద్దరూ వెళ్ళిపోయారు. ఈ రోజు స్వయంగా నా కళ్ళారా చూశాను. ఇంకా ఇదంతా అబద్ధం అంటారా." ప్రభావతి సూటిగా అంది. భాస్కర్ కలవరపడిపోయాడు. ఏం జవాబు చెప్పాలో తెలియక తడబడ్డాడు.

"ఏం మాట్లాడరు?" ప్రభావతి రెట్టించింది.

"ఎవరో పనీపాటా లేని ఆకాశరామన్నలు ఉత్తరాలు, ఫోన్లు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం నాకు లేదు." బింకంగా అన్నాడు.

"సరే, అది వదిలేసి ఇవాళ స్వయంగా నేను చూసినదానికి మీ సంజాయిషీ ఏమిటి?" తీక్ష్ణంగా అంది. భార్య అలా నిలేసేసరికి మగ అహం దెబ్బతిని పౌరుషం పొడుచుకు వచ్చింది.

"కోర్టులో ముద్దాయిని నిలబెట్టి అడిగినట్లు ఏమిటలా దబాయిస్తున్నావు? నాకు తెలియదని చెప్పాను. నమ్మాలంటే నమ్ము, లేకపోతే మాను. నీ చెత్త ప్రశ్నలకి జవాబు చెప్పాల్సిన అవసరం నాకు లేదు." అవసరం అయినదానికంటే గట్టిగా, కోపంగా దబాయించాడు. "మగాణ్ణి, లక్ష పనులుంటాయి. లక్ష మందితో మాట్లాడుతాను. అన్నీ నీకు చెప్పుకోవాల్సిన అవసరం నాకు లేదు." పొగరుగా అన్నాడు.

"ఆఁహాఁ, అలాగయితే నేనూ ఉద్యోగం చేస్తున్నాను. నాకూ లక్ష మందితో పనులుంటాయి. అవసరం అయితే నాకు నచ్చినవాడితో సరదాగా ఏ సినిమాకో, హోటల్‌కో వెడతాను. మీరు చూసీ చూడనట్లు ఊరకుంటారా?" నిలేసి అడిగింది.

"ఏమో, నీ ఆఫీసులో నీవేం చేస్తున్నావో, ఎవరితో మాట్లాడుతావో, ఎవరితో తిరిగావో నేను చూశానా. పట్టుబడేవరకు అందరూ పతివ్రతలే." హేళనగా అన్నాడు. ఈ దెబ్బ తనమీదకి తిరిగితే నోరు మూసుకుంటుందని బాణం వదిలాడు.

"అవును. నేనూ అదే అంటున్నాను. నేనలా పట్టుబడిననాడు మీరు సంజాయిషీ అడిగితే తప్పకుండా ఇచ్చుకుంటాను. ఇప్పుడు మీరు పట్టుబడ్డారు కనుక సంజాయిషీ ఇవ్వండి." ప్రభావతి అతని బాణాన్ని తిప్పి కొట్టింది.

"సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం నాకేం లేదు. నీ ఇష్టంవచ్చినట్లు అనుకో, నాకేం లెక్కలేదు. పెద్ద బయలుదేరింది సంజాయిషీ అడిగేందుకు." పళ్ళు కొరికాడు.

"సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, నేను మీ భార్యని కనుక. పెళ్ళి అంటే ఒకరికొకరు నీతినియమాలకు కట్టుబడి ఉంటామన్న ప్రమాణం కనక. ఇద్దరిలో ఎవరన్నా నీతి తప్పి ప్రవర్తిస్తే అడిగే హక్కు రెండోవారికుంటుంది." కచ్చితంగా ఒక్కొక్కమాట ఒత్తి పలికింది.

ఇదేదో ఆషామాషీ కాకుండా ప్రభావతి చాలా సీరియస్‌గా మాట్లాడుతుందన్నది భాస్కర్‌కి అర్థమైంది. ఛా తాను కాస్త జాగ్రత్తగా ఉండాల్సింది. ఇలా దొరికిపోయి దీనిముందు దోషిలా నిలబడాల్సి వచ్చిన తన నిర్లక్ష్యాన్ని తిట్టుకున్నాడు. భార్య ముందు తగ్గిపోవడం నామోషీ అనిపించింది. జవాబు ఏమీ తట్టక దబాయింపుకి దిగాడు.

"అంత హక్కు ఉందన్న దానివి ఆ ఉత్తరం వచ్చినప్పుడే ఎందుకు అడగలేదు. ఇన్నాళ్ళూ ఎందుకూరుకున్నావు." కోపంగా దబాయించాడు. ప్రభావతి ఆ కోపానికి బెదరనట్టు చాలా తాపీగా "అడిగేదాన్నే. నిజానిజాలు స్వయంగా చూడాలని ఆగాను. అంతేకాక, అడిగాక మీరు దోషి అని నిర్ణయం అయితే నేనేం చెయ్యాలో ఆలోచించుకోవాలిగదా! అడిగాక అవునని తేలితే ఏడ్చి, సాధించి, నా కర్మ ఇంతే అని సరిపెట్టుకోవడానికి నేనేం పాతకాలం ఆడదాన్నికాదుగదా! అన్నివైపులా ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికి ఆమాత్రం టైము నాకు కావాలిగదా." ప్రభావతి ఒక్కొక్క మాట నొక్కి నొక్కి చాలా శాంతంగా అంది. భాస్కర్ ప్రభావతి ఇంతదూరం ఆలోచించి ఇలా మాట్లాడుతుందన్నది ఊహించకపోవడంతో తెల్లపోయాడు.

"చూడండి, ఆకాశరామన్న ఉత్తరాలు, ఫోన్లు రాకముందునుంచే మీలో మార్పు కనిపెట్టలేనంత అమాయకురాలిని కాదు. ఓ ముప్ఫయ్ అయిదేళ్ళ మగాడు, వయసులో ఉన్నవాడు కట్టుకున్న భార్యని నాలుగు నెలల నుంచి వేలేసి తాకలేదంటే శారీరక ఇబ్బందన్నా ఉండాలి, మానసికంగా దూరమై ఉండాలి. అంతవరకూ ధూముధాములు చేసినా ఆ పది నిమిషాలు ప్రేమ! ఇప్పుడు రోజంతా ప్రేమ, ఆ పదినిమిషాలు ఎక్కడ భార్యతో గడపాలో అని ఆ టైమ్‌కి ధూముధాములు. ఇదంతా కనిపెట్టలేని అమాయకురాలిని కాను. చదువు లేని మొద్దుని కాను. ఏమన్నా ఎఫైర్లుంటేనే మగాడు గిల్టీగా ఫీలవుతూ భార్యమీద ఇదివరకటికంటే ప్రేమ కురిపిస్తాడు(నటిస్తాడు). మీ పరధ్యానం, అలంకరణలో మార్పు అన్నీ గుర్తించలేదనుకోకండి.

కానీ, ఇది ఊఁ, ఆఁ అంటే విడిపోయేంత తేలిక సంబంధం కాదు. పైగా, మనకో పిల్లవాడున్నాడు కనుక నిజం పూర్తిగా తెలిసేవరకు సహించి ఊరకున్నాను. ఇప్పుడింక..."

"ఓహో, ఇప్పుడింక సహించక ఏం చేద్దామని. ఇంట్లోంచి వెళ్ళిపోతానంటావా." లోపల బెదురుతూనే తగ్గిపోవడం ఇష్టంలేక బింకంగా అడిగాడు.

"వెళ్ళిపోవాల్సింది నేను కాదు మీరు. ఇది బ్యాంకువాళ్ళు నాకిచ్చిన ఇల్లు." భాస్కర్ అదిరిపోయాడు. ప్రభావతి ఇంత తేగేసి అంటుంది, ఇంతదూరం ఆలోచించి అప్పుడే నిర్ణయం తీసుకుంటుందని ఊహించని అతను షాక్ అయ్యాడు. కాసేపు నోట మాట రాలేదు. తరువాత మొహంలోకి నెత్తురుజిమ్మింది. అంటే నన్ను ఇంట్లోంచి పొమ్మనా." కోపంతో గొంతు వణకింది. ప్రభావతి సూటిగా అతని వంక చూసి అవునన్నట్లు తల ఆడించింది. భాస్కర్‌కి దాంతో పౌరుషం వచ్చేసింది.


చిత్రాలు: నర్సిం

"ఎంత పొగరు నీకు. ఉద్యోగం ఉందనా ఇంత మిడిసిపాటు. సంపాదిస్తున్నాననా ఇంత అహంకారం. కట్టుకున్నవాడిని ఇంట్లోంచి పొమ్మనేవరకు నీవు వచ్చాక నేనేం అంత చవటని కాను. నిన్ను పట్టుకు వేలాడే కర్మ నాకేం లేదు. ఆడదానివి నీకే అంత పొగరైతే నాకెంతుండాలి."


"ఓహో, పొగరులో కూడా ఆడదానికి తక్కువే ఉండాలన్నమాట." హేళనగా అంది.

"నాలుగు డబ్బులు సంపాదిస్తున్నానని మిడిసిపడకు. మొగుడు లేకుండా ఉండడం ఏమిటో నాలుగు రోజులుంటే తెలుస్తుంది. మీ ఆడాళ్ళు సంపాదన చూసుకుని ఎగురుతున్నారు. అందుకే ఆడదాన్ని ఇదివరకు చదువూ సంధ్యా లేకుండా మూల కూర్చోపెట్టారు. అదే సరి అయింది. చచ్చినట్టు పడి ఉండేవారు." కసిగా అన్నాడు.

"అవును అదే మీ బాధ. ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం లేనన్నాళ్ళూ మీ మగాళ్ళేం చేసినా చెల్లింది. తన్నినా నీవే గతి నాథా అని కాళ్ళు వదిలేది కాదు. ఉంచుకున్నదాన్ని తీసుకొచ్చి కాళ్ళు కడిగించినా సహించింది పాపం ఆనాటి ఆడది. ఇప్పుడు ఆడది సంపాదించాలిగాని, అలా పాత కాలంనాటి ఆడదానిలా పడుండాలి అంటే ఎలా కుదురుతుంది భాస్కర్‌రావుగారూ." హేళనగా అంది. భాస్కర్‌కి కోపం ముంచుకొచ్చినా అలా మాట్లాడుతున్న ప్రభావతిని ఏంచేయాలో అర్థం కాలేదు.

"సరే, నీకు మొగుడు అక్కరలేదంటే, ఇంత చిన్న విషయానికి కాపురం వదులుకోవడానికి నీవు సిద్ధపడితే..."

"ఇది చిన్న విషయమా! కట్టుకున్న పెళ్ళాం సంపాదించి, ఇల్లూ వాకిలి చూసుకుని, పిల్లల్ని కని, వంశాన్ని వృద్ధి చేయడానికి, సరసాలకి, సరదాలకి ప్రియురాలన్నది చిన్న విషయంలా మీకనిపించిందేమో? కానీ, ఇది పెద్ద అవమానం. నా వ్యక్తిత్వానికి అవమానం. ఈ ఇల్లు నాది, ఈ సంసారం నాది అని ఆడది చాకిరీ చేస్తుంది. అలా లేనప్పుడు ఈ ఇంటికోసం చాకిరీ చేసి సంపాదించి మీ చేతిలో పోయడం ఎందుకు? ఆ డబ్బుతో




గౌరవంగా, ఆత్మాభిమానం నిలుపుకుంటూ వేరేగా బతకడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాను."

భాస్కర్ బిత్తరపోయాడు. ఈ వ్యవహారం ఇంతదూరం వెళుతుందని ఊహించని అతను నిరుత్తరుడయ్యాడు. 'ఇల్లు, సంసారం, భార్యని వదిలేసి హఠాత్తుగా ఎక్కడికి వెళ్ళాలి. అందరికీ తెలిస్తే పరువేం కాను. బంధువుల ముందు తలెలా ఎత్తుకోవడం, రేపు ఆఫీసులో అందరికీ తెలిస్తే ఎంత చులకన!' అరక్షణంలో లక్ష ఆలోచనలు చుట్టుముట్టాయి. కలవరపడిపోయాడు. తగ్గిపోయినట్లు కనిపించడానికి అవమానం అనిపించింది.

"సరే, ఆడదానివి నీకంత నిబ్బరం అయితే నాకేం. రేపే రాహుల్‌ని తీసుకొని వెళ్ళిపోతాను. ఈ ఇల్లు నీవు కట్టుకుని ఊరేగు." ఉక్రోషంగా అన్నాడు.

"వాడి ఒంటిమీద చేయి వేశారంటే మర్యాద దక్కదు. కట్టుకొన్న భార్య, కన్న కొడుకు ఉండగా మరో ఆడదానితో తిరిగే మీరు రేపు వాడిని సరిగా చూస్తారని నాకేం నమ్మకం లేదు. వాడు నా దగ్గరే ఉంటాడు. కావాలంటే కోర్టుకెక్కండి. బలవంతంగా తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తే నలుగురినీ పిలిచి మీ సంగతంతా చెప్తాను. పోలీసు కంప్లయింట్ ఇస్తాను." నిష్కర్షగా అంది. "మీ దారిన మీరు వెళ్ళి ఆ రంజనతో ఊరేగండి." ఆ నిర్లక్ష్యాన్ని భరించలేక కోపంగా చెయ్యెత్తాడు. ప్రభావతి తీక్షణంగా చూసి చెయ్యి విసిరేసింది. "జాగ్రత్త. ఒంటిమీద చెయ్యి పడితే ఊరుకోను. మర్యాద దక్కించుకోండి."

"చూస్తా. వాడిని ఎలా ఇయ్యవో చూస్తా. తండ్రిగా నా హక్కు ఏ కోర్టు కాదంటుందో చూస్తా. నీ అంతు చూస్తా. నీ పొగరణచి నా కాళ్ళమీద పడేసుకోకపోతే నా పేరు భాస్కర్ కాదు. నీ గతి కుక్కకి కూడా పడకుండా చూస్తా. మొగుణ్ణి కాదన్నందుకు గుణపాఠం నేర్పుతా. ఆ రంజనని పెళ్ళాడి నీ రోగం కుదురుస్తా." చిందులు తొక్కుతూ సూట్‌కేస్ లాగి గబగబా బట్టలు కుక్కాడు. అప్పటికీ ప్రభావతి బెదరకపోవడం చూసి కల్లు తాగిన కోతి అయి పెట్టె ధడాలున మూసి "రేపు పొద్దున వచ్చి ఈ సామానంతా పట్టుకుపోతా. చచ్చినా ఈ ఇంట్లో ఉండను" అన్నాడు.

"ఏ సామాను పట్టుకెడతారు. ఈ ఇంట్లో గిన్నెలు, బొన్నెలు, మంచాలవీ మావాళ్ళిచ్చారు. టీవీ, ఫ్రిజ్ వగైరాలన్నీ నా జీతంతో కొన్నవి. బట్టలు తప్ప మీవేం లేవు ఇక్కడ."

తన జీతంతో ఇంటి ఖర్చు, ప్రభావతి జీతంతో ఇంట్లో సామానులు కొన్నారు. అది ఎంత తెలివిగా తన అవసరానికి తిప్పుకొంది. తనుత్త వెధవ అయిపోయాడు. "సరే చూస్తా. కోర్టులోనే తేల్చుకుందాం." విసవిసా వెళ్ళిపోయాడు.

* * *

రాత్రి పది గంటలవేళ సామానుతో వచ్చిన భాస్కర్‌ని చూసి రంజన తెల్లపోయింది. రంజన భాస్కర్ ఆఫీసులో పనిచేస్తూ ఓ ఇంట్లో గ్యారేజి

మీద ఉన్న రూములో అద్దెకుంటుంది. ఆ రూముకి బయటనించి ఇంటివాళ్ళ ప్రమేయం లేకుండా వచ్చిపోయే వీలుంది.

"ఇదేమిటి. ఇంతరాత్రి! ఈ సామానేమిటి?" ఆశ్చర్యపోయింది.

"ముందు లోపలికి రానీ చెపుతా." భాస్కర్ సామాను లోపల పెట్టి అంతా చెప్పుకొచ్చాడు. రంజన మొహం నల్లబడింది. "ఆ కోతిమూతి వెంకట్రావే రాసుంటాడు. వెధవ నేను వాడితో సరిగా మాట్లాడనని కోపం. ఇప్పుడేం చేద్దాం. అందరికీ తెలిస్తే ఆఫీసులో ఎలా మొహం ఎత్తుకోవడం." గాబరాగా అంది.

"ఈ వ్యవహారం ఇంతదూరం వెళుతుందనుకోలేదు. మనం కాస్త జాగ్రత్తగా ఉండాల్సింది. ప్రభావతి ఇంత సీరియస్‌గా దీన్ని తీసుకుంటుందనుకోలేదు."

"నీవిక్కడ ఉంటే ఏం చెప్పాలి అందరికీ. ఇంటి ఓనర్ ముసలావిడ. అసలే లక్ష ప్రశ్నలు వేస్తుంది. నిన్ను రెండు మూడుసార్లు చూసీ "ఎవరమ్మా అతను వచ్చిపోతుంటాడు" అని ఆరాలు తీసింది. "కజిన్ బ్రదర్. ఆఫీసు పనిమీద వచ్చిపోతుంటాడు అని సర్ది చెప్పాను." రంజన మాటల్లో అతనిక్కడ ఉంటే వచ్చే ఇబ్బందికి తాను సిద్ధంగా లేదన్నది ధ్వనించింది. భాస్కర్ ఉక్రోషంగా చూశాడు.

"అయితే, నీవూ పొమ్మంటావా. నీ పరువే నీకు ముఖ్యమా. ఇన్నాళ్ళూ ఈ పరువు గుర్తు రాలేదా. ఈ గొడవంతా నీవల్లేగా, తప్పంతా నాదే అన్నట్లుగా మాట్లాడుతున్నావు."

"అది కాదు భాస్కర్, ఒంటరి ఆడపిల్ల గదిలో మగాడుంటే లోకం ఏం అనదా." తడబడింది.

"కజిన్ బ్రదరన్నావుగదా. ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు, ఇల్లు దొరికేవరకు ఉంటాడని చెప్పు. ఈలోగా ఏదన్నా ఏర్పాటు చూసుకుంటాను." అతనికి అప్పటికీ మనసులో ఏదో మూల ఆశ! ఓ వారం రోజులూరుకుంటే ప్రభావతి కోపం తగ్గి, ఒంటరిగా ఉంటే ఇబ్బంది తెలిసి దారికొస్తుందనీ, ఏదో తనెళ్ళి కాస్త సారీ చెప్పి ప్రసన్నురాలిని చేసుకోచ్చన్న నమ్మకం ఉంది.

ఆరోజు ఇద్దరూ గదిలో ఒంటరిగా ఉన్నా, రాత్రంతా గడిపే అవకాశం వచ్చినా, ప్రతిసారీ దొంగచాటుగా కలుసుకోవడానికి ఆరాటపడి, అవకాశం దొరకగానే మళ్ళీ అలాంటి అవకాశం రాదన్నట్టు ఒకరి పొందులో ఒకరు మైమరచేవారు. ఆ రాత్రి అలాంటి చాన్సు వచ్చినా, ఒకే మంచంమీద దేహాలు దగ్గరగా ఉన్నా ఏ స్పందనా లేకుండా ఎవరిపాటికి వారు ఆలోచనలో ఉండిపోయారు.

* * *

దూరపు కొండలు నునుపు, అందని ద్రాక్ష పులుపు అన్న సామెతలు తెలిసినవే. కానీ, అందిన ద్రాక్ష తీపి. ఆ తీపి నాలుగు రోజులకే మొహం మొత్తేస్తుందన్నది పది రోజులలోగానే అనుభవంలోకి వచ్చేసింది. అందనంతవరకు ఊరించి, ఎలాగైనా అందుకోవాలన్న ఆరాటాన్ని పెంచి, అందుకోవడానికి దొంగ దారులు వెతికే మనసుకి కావలసింది అందగానే ఏ థ్రిల్లూ కనిపించదు. అప్పుడప్పుడు ఆరాటంగా దొరికే రుచి, అడగకుండానే కళ్ళెదుట ఉండేసరికి తిన బుద్ధిగాదు అన్నది ఇద్దరికిద్దరికీ ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చేసింది. ఇద్దరి మనసులూ సరిగా లేవు. చూసినవాళ్ళేం అంటారో, ఏం జవాబు చెప్పుకోవాలి అన్న బిడియం రంజనకి. ముందేం జరుగుతుంది. ప్రభావతి నిజంగానే నిర్ణయించుకొంటే బంధువుల ముందు తనేం చెప్పాలి. ఆఫీసులో పరువేం అవుతుంది అని భాస్కర్‌కి. భాస్కర్ ఎందుకైనా మంచిదని నాలుగు రోజులు సెలవు పెట్టాడు.

"ఛ, ఆఫీసులో అంతా నావంకే చూస్తున్నట్టు గిల్టీగా ఫీలవుతున్నాను. ఇవాళ తెలియకపోవచ్చు. నాలుగు రోజులు పోయాక నీవిక్కడున్నావని తెలిస్తే నా మొహం ఎలా చూపాలి అందరికీ." రంజన చిరాగ్గా అంది. "వెధవలు నీవు ఆఫీసుకి రాకపోతే నన్నడుగుతారేమిటి. 'మీకు తెలియకుండా ఉంటుందా' అన్నాడా టైపిస్ట్ వంకర నవ్వు నవ్వి." ఇంటి ఓనర్ ముసలావిడ ఎలా చూసిందో, "ఎవరమ్మాయి అతను అంటూ ఆరా తీసిందప్పుడే... ఎంత కజినయినా అలా ఓ గదిలో ఇద్దరూ ఉంటే చూసినవాళ్ళేం అనుకుంటారు. ఇల్లు వేగిరం చూసుకోమను అతన్ని" అంది విసుగ్గా. రంజన విసుగు చూసి అసలే చిరాగ్గా ఉన్న భాస్కర్‌కి కోపం వచ్చేసింది. "అంతేలే, కాళ్ళదగ్గరకొచ్చిన మగాడిని చూస్తే ఆడదానికి అలుసే. నీకోసమే ఇదంతా జరిగింది. ఇన్‌డైరెక్టుగా పొమ్మని చెప్తున్నావు. ఏదన్నా రూము చూసుకు పోతాలే. లేదంటే హోటలుకి పోతా ఇప్పుడే పొమ్మంటే. నిన్ను నమ్ముకుని నా పెళ్ళాం బిడ్డలకి దూరమై వచ్చినందుకు బాగానే ట్రీట్ చేస్తున్నావు. ఇన్నాళ్ళూ నన్ను వెర్రి వెధవని చేసి సినిమాలకి, షికార్లకి, హోటళ్ళకి ఖర్చు పెట్టించి నీ చుట్టూ తిప్పుకున్నావు. నాలుగు రోజులకే నీకు బరువయిపోయాను." రోజూ ఆఫీసు నుంచి వస్తూనే ధుమధుమలాడుతూ రంజన అంటున్న మాటలు వినగానే భాస్కర్‌కి చర్రున కోపం వచ్చేసేది.

"నాకిష్టం లేదన్నానా. అందరూ ఎలా మాట్లాడుతున్నారో చెప్పానంతే." సర్దుకుంటూ అంది రంజన.

"రంజనా, నా బట్టలన్నీ అలాగే ఉన్నాయి. ఉతికించలేదు." వచ్చిన నాలుగో రోజు అన్నాడు.

"ఉతికించడానికి నాకేం పని మనుషులు లేరు. నీ బట్టలు నేను ఉతకడం ఏమిటి? నీవు ఉతుక్కోవాలి గానీ. నీ పెళ్ళాన్ననుకున్నావా." వారం రోజులకే రంజన జవాబు.

"అబ్బ పొద్దుటా ఇదే వంట, రాత్రి ఇదేనా. రాత్రికి కాస్త కూరైనా వేరే వండకూడదూ!"


"రెండుపూటలా వండడానికి నాకేం ఓపిక లేదు బాబూ. చచ్చి చెడి ఆఫీసు నుంచి వచ్చి మళ్ళీ ఎవరొండుతారు. నేనెప్పుడూ రెండుపూటలకీ ఒకసారే వండుకుంటాను." నిర్లక్షపు జవాబు. వేడివేడిగా ఏపూట కాపూట వండిపెట్టే ప్రభావతీ ఉద్యోగం చేసేది మరి. చాకిరీతో అలసిపోయినా తను తినడని రెండు పూటలా వండేది. ఎప్పటికప్పుడు బట్టలుతికించి ఇస్త్రీ చేయించేది. బనీను కనపడకపోయినా అరిచేవాడు. ఇప్పుడు రంజనని ఏదన్నా, ఆఖరికి ఇంకో కప్పు కాఫీ అడగాలన్నా భయమే.

"ఇంట్లోనే ఉంటున్నావు. అలా బజారుకెళ్ళి కూరలన్నా తేవచ్చుగా." విసుగు భాస్కర్ మీద చూపింది రంజన. బ్యాంక్ నుంచి వస్తూ ప్రభావతి కూరలు తెచ్చుకునేది. అలవాటు లేదన్న భాస్కర్‌ని చురచుర చూసింది రంజన.

ఆఫీసుకొచ్చేటప్పుడు ఫెళఫెళలాడే గంజి ఇస్త్రీ చీరతో ఫుల్ మేకప్‌తో, బాబ్డ్ హెయిర్‌తో వచ్చే రంజన- ఇంట్లో ఉన్నంతసేపూ పాత నలిగిన నైట్ గౌనుతో ఉంటుంది. అదీ రెండు మూడు రోజులకు కానీ ఉతుక్కోదు. ఇంటికి రాగానే జుట్టుకి నూనెలు పట్టిస్తుంది. మొఖానికి క్రీములు పట్టించుకుని బద్ధకంగా పక్కమీద పుస్తకం చదువుతూ దొర్లుతూండే రంజనని చూసి రియాలిటీ ఎంత చేదు అనిపించింది భాస్కర్‌కి. మేకప్పులు లేకపోయినా, పెద్ద అందం లేకపోయినా నీటుగా ఒళ్ళు, బట్టలు, ఇల్లు ఉంచుకునే ప్రభావతితో పోల్చుకోకుండా ఉండలేకపోయాడు. అసలు రంగులు కలిసి ఉంటేగాని బయటపడవు. ఈ అందం కోసమా అంత రిస్క్ తీసుకుని వెంటబడి కాపురానికే చేటు తెచ్చుకున్నాడు తను.

పదిహేను రోజులకే ఒకరంటే ఒకరికి మొహం మొత్తేసింది. "ఏంటలా అరుస్తున్నావు. నీ కట్టుకున్న పెళ్ళాన్ని అనుకుంటున్నావా. నీకు మూడు పూటలా వేడిగా వండి వార్చడానికి నేను నీ పెళ్ళాన్ని కాదు. పెట్టిందేదో తిను, లేదంటే వండుకో." తెగేసి అంది రంజన ఓ రోజు భాస్కర్ చల్లారిన భోజనం తినలేను అంటే.

"నీ పెళ్ళాం వెళ్ళి ఆఫీసులో చాటింపు చేసి వచ్చిందనుకుంటాను. ఆ సుశీల ఏమందో తెలుసా, 'తోటి ఆడదాని సంసారం కూల్చడం సంస్కారం అనిపించుకోదు. నిక్కావాలంటే పెళ్ళయిన మగాడు తప్ప మరోడు దొరకడా' అని మొహంమీద




ఉమ్మేసినట్లు అంటే తలదించుకున్నా" అంది ఓ రోజు.

"మామ్మగారు అల్టిమేటం ఇచ్చేసింది ఇల్లు ఖాళీ చెయ్యమని. ఇది సంసారుల కొంప. కజిన్ అట కజిన్. మంచి పేరే పెట్టావు. మీరు కళ్ళు మూసుకొంటే లోకం మూసుకోవద్దూ. మాకంతా తెలిసిందే అమ్మాయి. ఈ ఫస్టుకి ఇల్లు ఖాళీ చెయ్యమంది." ఏడుపు మొహంతో అంది రంజన. ప్రభావతి ఫ్రెండు సుశీల ఆఫీసులో, ఇంటావిడతో చెప్పిందనగానే ఇద్దరికిద్దరూ చెదిరిపోయారు. సెలవై వెళ్ళిన భాస్కర్‌ని రూముకి పిలిచి చీవాట్లు పెట్టాడు తిరస్కారంగా చూస్తూ బాస్. రంజనని ఏహ్యంగా చూశాడు.

"నాయనా, బుద్ధి గడ్డి తిని నీ ప్రేమ కబుర్లకి లొంగి ఎఫైర్ నడిపాను. నన్ను వదిలిపెట్టు ఇంక. నీవల్ల అందరి ముందూ దోషిలా నిలబడ్డాను. ప్లీజ్ గో ఎవే ఫ్రం హియర్." రంజన ఆఫీసులో జరిగిన అవమానంతో రెచ్చిపోయి నిష్కర్షగా అనేసింది.

"ఛా...ఛా...ఏదో పై మెరుగులకి మోసపోయి మోజుపడ్డాను. మేడిపండువని తెలియక, కట్టుకొన్న ఇల్లాలిని దగా చేసినందుకు బాగానే బుద్ధి చెప్పావు. ఏ విషయంలోనూ ప్రభావతి కాలి గోటికి సరిపోవు." భాస్కర్ అంతకంటే గట్టిగా అరిచాడు.

"మరింకేం, వెళ్ళు. నీ పతివ్రత పెళ్ళాం దగ్గరికి. ప్రతి మగాడూ నీలాగే నాలుగు రోజులు మోజు తీరిపోయాక పెళ్ళాం పతివ్రతలాగే కనపడి పశ్చాత్తాపం వచ్చేస్తుంది. మీలాంటి పెళ్ళయిన వాళ్ళ మాటలు నమ్మడం మా బుద్ధి తక్కువ. ఇంకా నీతో మాటలేమిటి. గెటౌట్ నౌ." రంజన




తిరస్కారంగా చూస్తూ అంది.

"పోక నీ కొంప పట్టుకుని ఇంకావేళ్ళాడుతాననుకున్నావా?" గబగబా బట్టలన్నీ సూట్‌కేసులో కూరేశాడు.

* *

"అదేం అప్పుడే మోజు తీరిపోయిందా ఏమిటి వెనక్కి వచ్చేశారు. అయ్యో, కనీసం ఒక నెలన్నా కాలేదే. ఇరవై రోజులకే ప్రేమంతా చిల్లు బాల్చీలో నీళ్ళలా కారిపోయిందా".తలుపు తీసిన ప్రభావతి హేళనగా అంది గుమ్మంలోనే నిలబడి.

"ప్రభా ఫర్ గాడ్ సేక్. చచ్చిన పాముని ఇంకా చంపకు. బుద్ధి వచ్చింది. దూరపు కొండల సామెత



"మొగుణ్ణి కాదన్నందుకు గుణపాఠం నేర్పుతా. ఆ రంజనని పెళ్ళాడి నీ రోగం కుదురుస్తా." చిందులు తొక్కుతూ సూట్‌కేస్ లాగి గబగబా బట్టలు కుక్కాడు.

అర్థమైంది. ఏదో పై మెరుగులకి మోసపోయి, చలించి తప్పు చేశాను, ఒప్పుకుంటున్నాను... సారీ." క్షమాపణ చెపితేగాని ప్రభావతి లోపలికి రానీయదన్నది అర్థమై అప్పటికే సగం చచ్చి, ఆత్మాభిమానం చంపుకుని వచ్చిన భాస్కర్ తెగేదాక ఇంకా లాగితే నష్టం తనకే అన్నది గ్రహించి రాజీ ధోరణిలో సారీ చెప్పాడు. "ప్రభా ముందు లోపలికి రానీ. మనం మాట్లాడుకుందాం. సారీ చెప్పాగా." ప్రభావతి అతని వంక సూటిగా చూసింది.

"ఒక్క మాటకి జవాబు చెప్పండి. ఇదేపని నేను చేసి, ఓ నెల నా ఇష్టం వచ్చినవాడితో ఉండి, సారీ తప్పు చేశాను అంటే మీరేం జవాబు చెప్తారు."

భాస్కర్ తల దించుకున్నాడు. "చెప్పరు. జవాబు చెప్పరు. చెప్పలేరు. ఎందుకంటే, అలా గీత దాటిన ఆడదాన్ని క్షమించే ప్రశ్న మీకుండదు. ఎందుకంటే, అలా జరగదు. జరిగినా మీరు వెనక్కి తగ్గరు. తగ్గిపోవడానికి, అలాంటి భార్యని వెనక్కి తీసుకోవడానికి మీ పురుషాహంకారం అడ్డొస్తుంది. అలా తప్పు చేసిన ఆడదానికి వెనక్కి రావడం అన్న ప్రశ్న ఉండదు." భాస్కర్ దోషిలా తల దించుకున్నాడు.

"ప్రభా నీవు చెప్పిందంతా నిజమే. అందుకే స్త్రీని క్షమయా ధరిత్రీ అన్నారు. మగాళ్ళు ఏ తప్పు చేసినా కన్న తల్లిలా క్షమించి ఔదార్యం చూపిస్తుంది. ఆ గుణం మాకు లేదు."

"అవును. యుగయుగాలుగా సహనశీలురు, క్షమయా ధరిత్రులు లాంటి బిరుదులిచ్చి సీతలు, అనసూయలతో అడుగడుగునా పోలుస్తూ మగాడేం చేసినా ఆడది క్షమించడాలు, పాఠాలు, నీతి బోధలు చేసి, చేస్తూ మగాళ్ళకి ధైర్యం కలిగించారు. పెళ్ళాం ఏం చేస్తుంది, నాలుగు రోజులు ఏడుస్తుంది. మహా అయితే పుట్టింటికి పోతుంది. మొగుణ్ణి, సంసారాన్ని వదులుకోదు. ఎన్ని వెధవ పనులు చేసినా 'క్షమించు' అనగానే కరిగిపోయి మొగుణ్ణి కౌగిలిలోకి తీసుకుంటుందన్న ధైర్యం ఉండబట్టే మీ మగాళ్ళిలా ఆడుతున్నారు. కానీ, ఆ రోజులు పోయాయి. ఈనాటి ఆడది భర్త లేకపోయినా, కాపురం లేకపోయినా స్వశక్తితో తన కాళ్ళమీద నిలబడగలదు. పిల్లల్ని పెంచుకోగలదు. లోకంలో ఒంటరిగా బతికే స్థయిర్యం ఆమెకి ఆర్థిక స్వాతంత్రం ఇచ్చింది అన్నది మరువకండి. నాకు ఇప్పుడు మీ అవసరం లేదు. బాబుని పెంచుకోగలను. మొగుడు లేకపోయినా నాకేం దిగులు లేదు. చూడండి. మగాడికి ఆడది ఇంటి చాకిరీ చెయ్యాలి, బయట ఉద్యోగాలు చేసి సంపాదించి తెచ్చి చేతిలో పోయాలి. ఇంట్లో కమ్మగా, వేడిగా వండి పెట్టాలి. ఇంటా బయటా చచ్చీ చెడి చాకిరీ చేసి అలసిపోయినా, భర్తగారు ఇంటికొచ్చేసరికి తెల్లచీర, మల్లెపూలతో ముస్తాబై కంటికానందం కలిగించాలి. శయనేషు రంభ అవాలి. బాగుంది. మరి ఆడదానికీ భర్త అలాగే ఉండాలనిపించదా. ప్రియురాలనేసరికి రెండుసార్లు గడ్డాలు గీస్తారు, స్నానాలు, పళ్ళు తోముకోవడాలు, సెంట్లు పూసుకోవడాలు ఇవన్నీ చేసే మొగుడు, పెళ్ళాం అనేసరికి జిడ్డు మొహం, చెమట కంపు, నోరు కంపు, కుళ్ళు లుంగీతో పక్కమీద కొస్తాడేం. చూడండి, ఏ ఆడదీ రోజంతా సింగారించుకొని కూర్చోలేదు. అందులో ఈ ఉరుకుల పరుగుల జీవితంలో అసలు కుదరదు. అంతమాత్రానికి ఇల్లాళ్ళు హిడింబిల్లా, ప్రియురాళ్ళు ఊర్వశుల్లా కనపడతారు. ఆ ఆకర్షణకి లొంగిపోయి పరాయి ఆడదాని వెంటపడే మీ మగ మనస్తత్వం ఈ తరం ఆడది సహించదు."

"ప్రభా, ఇల్లు, భార్య, సంసారం, పిల్లలు అన్న పదాలకి అర్థం బాగా అర్థం అయింది. ఇంట్లో భార్య ఎంత బాగా దోసెలు చేసినా హోటలు దోసె రుచి రాదన్నట్లు అప్పుడప్పుడు హోటలుకి వెళ్ళి కక్కుర్తి పడతారు. ఇదీ అంతే. పొరుగింటి పుల్లకూర రుచి..."

"అవును, హోటలుకి వెళ్ళి దోసె తినడం లాంటిదే ఇదీనూ. కాస్త రొటీన్ నుంచి పెళ్ళాం విసుగనిపించినప్పుడు నాలుగు రోజులు థ్రిల్లు కావాలి మీకు. మంచిదే. మేమూ అలాంటి మనుషులమే. మాకూ జిహ్వా చాపల్యం ఉండదా. హోటలుకి వెళ్ళి దోసె తినాలనిపించదా." ప్రభావతి హేళనగా అంది. భాస్కర్ నిస్సహాయంగా చూశాడు.

"ప్రభా, నేనింకేం చెప్పను. తప్పు చేశానని ఒప్పుకుంటున్నాను. క్షమాపణ కోరాను."

"డాడీ." బయటినించి ఆడుకొని వచ్చిన రాహుల్ సంబరంగా తండ్రిని చూసి అరిచి చంక ఎక్కాడు. ఆ క్షణంలో తనని కాపాడే ఆపద్బాంధవుడిలా కనిపించాడు భాస్కర్‌కి. కొడుకుని ఎత్తుకొని ముద్దులు పెట్టుకున్నాడు. కొడుకు కోసమన్నా ప్రభావతి క్షమించకపోదన్న ధైర్యం వచ్చింది. "ఎక్కడికెళ్ళావు డాడీ. మమ్మీ చెప్పింది ఊరికెళ్ళావని. ఇన్నాళ్ళెందుకెళ్ళావు. ఫో. నీతో కట్." రాహుల్ ముద్దులు గునిశాడు. "ఏం చెయ్యను రాహుల్. మీ మమ్మీ ఇంట్లోంచి పొమ్మంది. సారీ చెప్పినా రానీయడం లేదు చూడు." కొడుకే రక్షించే దారి అన్నట్టు అన్నాడు.

"అవునా మమ్మీ. పోనీలే పాపం. సారీ చెప్పారుగా. ఇంకెప్పుడూ చెయ్యరులే అలా. రానీ మమ్మీ."

"హు మీకో కొడుకుండబట్టి బతికిపోయారు. పిల్లాడికి తండ్రి ప్రేమ, ఆదరణ కూడా కావాలి. వాడు తండ్రి లేడని బాధపడకూడదు. వాడికి తండ్రి ప్రేమ కరువు చేసే అధికారం నాకు లేదు. వాణ్ణి కన్న పాపానికి మీ పాపం భరించాలి. రేపు వాడు పెద్దయి నన్ను దోషిలా చూడకూడదని లోపలికి రానిస్తున్నాను. బెదిరింపు అనుకోకుండా ముందే ఒక విషయం స్పష్టం చేస్తున్నాను. ఈ ఇంట్లో ఈ రోజు నుంచి మీ స్థానం నా భర్తగా కాదు. రాహుల్ తండ్రిగా మాత్రమే అన్నది మీరంగీకరిస్తే లోపలికి రండి. కుక్క ముట్టిన కూడు నేను తినను." ప్రభావతి కచ్చితంగా అని గుమ్మంలోంచి తొలగి లోపలికి వెళ్ళింది.

ఆమాత్రం చాలు అన్నట్టు భాస్కర్ గబగబా లోపలికి అడుగు పెట్టాడు. ప్రభావతి కోపం ఎన్నాళ్ళుంటుంది. నాలుగు రోజులు పోతే సర్దుకుంటుంది అన్నది అతని నమ్మకం, ధైర్యం.

కానీ, ప్రభావతి ఈనాటి స్త్రీ. చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం ఉన్న స్త్రీ అన్నది భాస్కర్‌కి తరువాత తరువాత అర్థం కావచ్చు. ■